క్లుప్తంగా

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ

యాచారం: నక్కర్తమేడిపల్లి ఉన్నత పాఠశాలకు గ్రామ మాజీ సర్పంచ్ ఎరుకలి బాలరాజ్‌గౌడ్ మైక్‌సెట్ వితరణ చేశారు. శుక్రవారం గ్రామస్తుల సమక్షంలో హెచ్‌ఎం ఉదయశ్రీకి అందజేశారు. భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణ, ముచ్చర్ల సంపత్, మధుకర్‌రెడ్డి, సురేష్, నరేష్, నాగరాజు, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు



తాడు ఆడుతున్న విద్యార్థినులు

ఆమనగల్లు: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శుక్రవారం ఆటల పోటీలు జరిగాయి. పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. విజేతలకు రిపబ్లిక్‌డేన బహుమతులు ప్రదానం చేస్తామని పేర్కొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న శివ

మాడ్గుల: ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమయిందని సోషలిస్టు విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏర్పుల శివ ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు గ్రామ సభలను నిర్వహిస్తోందని విమర్శించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వాలు, పాలకులు మారినా.. విధానాలు మారటం లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే విద్యార్థుల పెండింగ్ ఉపకార వేతనాలు ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. అధికారం చేపట్టి ఏడాది దాటినా స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ ఇవ్వలేదని వెల్లడించారు. సకాలంలో నిధులు అందక విద్యార్థులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యారంగంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటం సరైంది కాదని హితవు పలికారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, ఉపకార వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరమని, అర్హులు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శుక్రవారం నగరంలోని ఆయన నివాసంలో లబ్ధిదారులకు అందజేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో మరిన్ని రోగాలను చేర్చడంతో పాటు, రూ.10 లక్షలకు వైద్య సాయం పెంచిందని పేర్కొన్నారు. ఆమనగల్లు పట్టణంలో నూతనంగా ప్రభుత్వ ఆస్పత్రి భవనం నిర్మిస్తున్నామని, త్వరలో మెరుగైన వైద్యసేవలతో అందుబాటులోకి తెస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మాజీ సభ్యుడు అనంతరెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటరమణారెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

సాగు భూములకు రైతు భరోసా

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

తుక్కుగూడ: సాగు యోగ్యమైన భూములకు రైతు భరోసా అందుతుందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. శుక్రవారం తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన రైతులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా కేఎల్లార్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ హయాంలో రైతుల పేరుతో అస్సైన్డ్, వెంచర్లు, జాతీయ రహదారుల భూములకు కొందరు రైతుబంధు పొందారని ఆరోపించారు. చెరువుల కింద భూములు తీసుకున్న రైతులకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, అర్హులందరికీ న్యాయం జరిగేలా జాబితా సిద్ధం చేస్తుందని పేర్కొన్నారు.

సాగు'బడి'

- ప్రభుత్వ పాఠశాలలో కూరగాయల సాగు
- సేంద్రియ విధానంలో పంటలు
- తాజా కూరగాయలతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం



మజీద్‌పూర్ పాఠశాల

అబ్దుల్లాపూర్‌మెట్: ఓ పక్క కూరగాయల ధరలు మండిపోతున్నాయి. మరో పక్క కలుషిత నీరు, వాతావరణంలో పండిన కాయగూరలతో విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారు. వీటికి తోడు మధ్యాహ్న భోజన నిర్వాహకులకు బిల్లులు అంతంత మాత్రమే అందడంతో, నామమాత్రంగా వంటలు చేస్తూ.. వడ్డిస్తున్నారు. వీటన్నింటిని అధిగమించేందుకు ఉపాధ్యాయ బృందం వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టింది. సేంద్రియ విధానంలో పాఠశాల ఖాళీ స్థలంలోనే కావలసిన ఆకుకూరలు, కాయగూరలు పండిస్తూ ఔరా అనిపిస్తున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మజీద్‌పూర్ గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 'న్యూట్రిషనల్ గార్డెన్'ను ఏర్పాటు చేశారు. విద్యార్థులు, సిబ్బంది పరి రక్షణలో పండిన తాజా కూరగాయలతో మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు కూరలు వడ్డిస్తున్నారు.

గార్డెన్ కమిటీ

ఆకు కూరలతో పాటు కాయగూరలు పండిస్తూ విద్యార్థుల సంపూర్ణ ఆరోగ్యం కోసం ఉపాధ్యాయ బృందం కృషి చేస్తోంది. మధ్యాహ్న భోజనానికి గార్డెన్‌లో సాగైన ఆకుకూరలు, కాయగూరలతో కూరలు వండుతున్నారు. సాగుకోసం విద్యార్థులతో 'న్యూట్రిషనల్ గార్డెన్' కమిటీ వేశారు. ఈ కమిటీకి విద్యార్థుల తల్లి దండ్రులు, ఉపాధ్యాయ బృందం సాయం అందిస్తోంది. ఇదిలా ఉండగా.. కొద్దిపాటి పెట్టుబడితో పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం అందించే తాజా కూరగాయలతో భోజనం వడ్డించడంతో పిల్లలతో పాటు తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఉపాధ్యాయులను అభినందిస్తున్నారు.



పాలకూర, క్యాలీఫ్లవర్, కొత్తిమీరు

ఆరోగ్యంతో పాటు పరిజ్ఞానం..



విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పాఠశాల ప్రాంగణంలో కూరగాయలు పండిస్తున్నాం. కొద్ది పాటి స్థలంలో సేంద్రియ పద్ధతిలో పాలకూర, గోంగూర, మెంతికూర, తోటకూర, కొత్తిమీర, టమాటో, వంకాయ, మిర్చీ, క్యాలీఫ్లవర్, క్యాబేజి తదితర వాటిని సాగు చేస్తున్నాం. మధ్యాహ్న భోజనంలో వడ్డిస్తున్నాం. ఈ బాధ్యత సమష్టిగా తీసుకున్నాం. ఈ విధానం.. విద్యార్థులకు ఆరోగ్యంతో పాటు.. పరిజ్ఞానం పెంపొందిస్తుంది.

– వి.విజయ్ భాస్కర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు

నిఘానీడలో గ్రామ సభలు

- భూ రికార్డులను మార్చాలని ఫార్మాసిటీ భూ బాధితుల విజ్ఞప్తి
- ఏసీపీ కేపీవీ రాజు ఆధ్వర్యంలో బందోబస్తు

యాచారం: ఫార్మాసిటీకి భూములిచ్చిన నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో శుక్రవారం ప్రజాపాలన గ్రామ సభలు పోలీసుల నిఘానీడలో జరిగాయి. ఫార్మాసిటీకి బలవంతంగా పట్టా భూములు తీసుకుని, రికార్డుల్లో టీజీఐఐసీ పేరు నమోదు చేయడం, గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు భూసేకరణ చేస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎలాంటి ఆందోళనలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. గ్రామసభల్లో శాంతియుతంగా సమస్యలు చెప్పుకోవాలని, లేదంటే చట్టపరమైన చర్యలు ఉంటాయని ముందస్తు హెచ్చరికలు జారీ చేయడంతో.. భూ బాధితులు శాంతియుతంగా టీజీఐఐసీ పేరు మీద ఉన్న భూరికార్డులను తమ పేరిట మార్చాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

జాబితాలో అర్హుల పేర్లను చేర్చండి

నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, కుర్మిద్ద, తాడిపర్తి గ్రామాల్లో అర్హులైన చాల మంది పేర్లు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల లిస్టుల్లో లేవని పలు రాజకీయ పక్షాల నాయకులు అధికారుల దృష్టికి తెచ్చారు. నక్కర్తమేడిపల్లిలో అర్హులైన వారికి గ్రామ కంఠం భూమిలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ అధికారులకు కోరారు. మొండిగౌరెల్లిలో చాలామంది కొత్త పథకాలకు అర్హులని, అర్హుల జాబితాలో వారి పేర్లను చేర్చాలని బీజేపీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ ఆధ్వర్యంలో యాదగిరిరెడ్డి, నరేష్, సత్తయ్యలు అధికారులకు వినతిపత్రం అందజేశారు. సభల్లో ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, తహసీల్దార్ అయ్యప్ప పాల్గొన్నారు. పట్నం ఏసీపీ కేపీవీ రాజు ఆధ్వర్యంలో చేపట్టిన బందోబస్తులో గ్రీన్ ఫార్మా సిటీ, యాచారం సీఐలు కృష్ణంరాజు, నర్సింహ రావులు, ఎస్‌ఐలు, ఇబ్బంది పాల్గొన్నారు.



కుర్మిద్ద గ్రామసభ వద్ద మోహరించిన పోలీసులు

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి



ముర్తుజపల్లిలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఆచారి, విక్రంరెడ్డి

ఆమనగల్లు: మున్సిపాలిటీ అభివృద్ధికి బీజేపీ పాలకవర్గం విశేషంగా కృషి చేసిందని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి అన్నారు. మున్సిపల్ పరిధి చంద్రాయణపల్లి, ముర్తుజపల్లి, జంగారెడ్డిపల్లి, ఉదయనగర్ కాలనీలలో రూ.18 లక్షలతో నిర్మించ తలపెట్టిన మురుగుకాలువ, సీసీరోడ్ల పనులను చైర్మన్ రాంపాల్‌నాయక్, పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు విక్రంరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆచారి మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో పుర ప్రజలు బీజేపీని నమ్మకంతో గెలిపించారని, ఆ నమ్మకం వమ్ముకాకుండా పాలకవర్గం పనిచేసిందని చెప్పారు. మున్సిపాలిటీలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరిగాయని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ దుర్గయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు హరిప్రసాద్, బీజేపీ నాయకులు రాంరెడ్డి, రవిరాథోడ్, నర్సింహ, కౌన్సిలర్లు విక్రంరెడ్డి, లక్ష్మణ్, కృష్ణనాయక్, కృష్ణయాదవ్, నాయకులు జగన్‌రెడ్డి, శ్రీకాంత్, గోపాల్, లక్ష్మణ్, నిరంజన్‌రెడ్డి, మహేశ్, వెంకటేశ్, భాస్కర్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం ప్రజాసేవలో..

- ఒడిదొడుకుల మధ్య అభివృద్ధి
- ఇబ్రహీంపట్నం పుర పాలకవర్గ సభ్యులు
- ఘనంగా వీడ్కోలు సమావేశం



వీడ్కోలు సన్మాన కార్యక్రమంలో చైర్ పర్సన్ స్రవంతి, కౌన్సిలర్లు

ఇబ్రహీంపట్నం: రాజకీయంగా ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా.. నిరంతరం ప్రజాసేవలో ఉన్నామని, రాజీ పడకుండా మున్సిపల్ అభివృద్ధికి పాటుపడ్డామని మున్సిపల్ చైర్ పర్సన్ కప్పరి స్రవంతి అన్నారు. పాలకవర్గం పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్, కౌన్సిలర్లకు వీడ్కోలు సన్మాన సభను పుర కార్యాలయంలో కమిషనర్ రవీంద్రసాగర్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు, చైర్ పర్సన్ మాట్లాడుతూ.. ఐదేళ్ల పదవి కాలంలో కోవిడ్ రూపంలో రెండేళ్లు అభివృద్ధి పనులకు ఆటంకం కలిగిందని, రాజకీయ విభేదాలు తలెత్తినా ప్రజలకు పరిపూర్ణంగా సేవలు అందించామని పేర్కొన్నారు. అభివృద్ధి పనులు ఎన్నో చేశామని, ఇంకా చేయాల్సినవి ఉన్నాయన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ బర్ల మంగ, కౌన్సిలర్లు ఈర్లపల్లి సునీతరెడ్డి, నీళ్ల భానుగౌడ్, నాయిని సత్యనారాయణ, నీలం శ్వేతా, పి.శంకరయ్య, ఆకుల మమత, ఎండీ సుల్తానా బేగం, యాచారం సుజాత, నరాల విశాల, జగన్, పద్మయాదవ్, నల్లబోలు మమత, అల్వాల జ్యోతి, శ్రీలత, కో ఆప్షన్ సభ్యులు రాంరెడ్డి, ఎండీ మోబిన్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన కమిటీ నియామకం

ఇబ్రహీంపట్నం రూరల్: మంగళ్‌పల్లి మహామ్మాయి దేవాలయ కమిటీ నూతన పాలకవర్గాన్ని శుక్రవారం దేవాదాయ ధర్మదాయ శాఖ ప్రకటించింది. నియామక ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్‌గా ఆదిబట్ల మున్సిపాలిటీ మంగళ్‌పల్లికి చెందిన చెనమోని సత్యనారాయణను నియమించింది. పాలకవర్గం సభ్యులుగా గజ్జెల సంతోష్‌కుమార్, ఏదుళ్ల నర్సమ్మ, వట్నాల వెంకటేశ్, కీలుకత్తి శ్రీనివాస్‌గౌడ్‌లను నియమించినట్లు ఆ శాఖ అధికారి ప్రణీత్ తెలిపారు. అమ్మవారి సన్నిధిలో నూతన సభ్యులు ప్రమాణస్వీకారం చేసి, బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. నిరంతరం ధూపదీప నైవేద్యాలు ఏర్పాటు చేస్తామన్నారు. నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి, మంగళ్‌పల్లి పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు



ఆలయ నూతన కమిటీ సభ్యులు

గ్రామానికి అదనపు బస్సులు తిప్పాలి



డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

మంచాల: ఇంతకు ముందులాగే బండలేమూర్ గ్రామానికి అదనపు ఆర్టీసీ బస్సులు నడిపించాలని గ్రామ ప్రజలు, సీపీఎం నాయకులు కోరారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకట నర్సప్పకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గ్రామం నుంచి ఉదయం 10 గంటల బస్సు వెళితే, సాయంత్రం 3 గంటల వరకు బస్సు సౌకర్యం లేదని పేర్కొన్నారు. దీంతో ప్రజలు రవాణా ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. గతంలో గ్రామానికి నైట్‌హాల్ట్ ఉన్న చౌటుప్పల్ బస్సును, ఆరుట్ల గ్రామంలో నైట్‌హాల్ట్ చేశారని తెలిపారు. ఇంతకు ముందులాగే గ్రామానికి అదనంగా 12, 1.30 గంటలకు ఇబ్రహీంపట్నం రాకపోకలకు బస్సు సౌకర్యం కల్పించాలని విన్నవించారు. యథావిధిగా చౌటుప్పల్ నైట్‌హాల్ట్ బస్సును కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కృష్ణ, వీరయ్య గౌడ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

మాదిగల పోరాటానికి అన్నివర్గాల మద్దతు

ఇబ్రహీంపట్నం: లక్ష డప్పులు, వెయ్యి గొంతుల మాదిగల పోరాటానికి అన్నివర్గాలు మద్దతు తెలపాలని ఎమ్మార్పీస్ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి సిద్దపురం శ్రీకాంత్, ఎంఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పాండు కోరారు. శుక్రవారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ పరంగా దోపిడీకి గురౌతున్న 58 మాదిగ ఉపకులాలకు జనాభా ప్రకారం ఎస్సీ రిజర్వేషన్‌ను కల్పించాలని డిమాండ్ చేశారు. 30 ఏళ్లుగా పోరాటం చేస్తున్నామని, సుప్రీం కోర్టు తీర్పుతో సంబురపడ్డామని పేర్కొన్నారు. కానీ కొందరు అడ్డుతగలడంతో ఆగిపోయిందని ఆరోపించారు. వర్గీకరణే లక్ష్యంగా ఫిబ్రవరి 7న నగరంలో నిర్వహించే పోరాట సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సంఘం పట్నం మండల అధ్యక్షుడు సతీష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శివకృష్ణ, సుధాకర్, మహేశ్, సతీష్, బాబు, అంజయ్య, మల్లేశ్, రవి, బాలరాజ్, జంగయ్య, నరసింహ, సురేందర్, నరేందర్, నాగరాజు, బాషయ్య, ప్రశాంత్‌లు పాల్గొన్నారు.

ముగిసిన మాజీ సర్పంచ్ అంత్యక్రియలు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మాజీ సర్పంచ్ పోగాకు వీరప్ప అంత్యక్రియలు శుక్రవారం ముగిసాయి. అనారోగ్య సమస్యలతో ఆయన గురువారం కన్నుమూసారు. బీఆర్‌ఎస్ భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మీపతిగౌడ్ వీరప్ప భౌతికకాయానికి నివాళులర్పించారు.

చెన్నకేశవరెడ్డికి నివాళి

ఇబ్రహీంపట్నం: కామ్రేడ్ చెన్నకేశవ రెడ్డికి సీపీఎం నేతలు జోహార్లు అర్పించారు. గురువారం దండుమైలారంలో జరిగిన సంతాపసభలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందులో సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య, సామెల్, బుగ్గరాములు, జంగయ్య, జగన్ ఉన్నారు.

వసతుల కల్పనకు కృషి

తుక్కుగూడ: వార్డులో మౌలిక వసతుల కల్పనకు తమ వంతు కృషి చేస్తామని కౌన్సిలర్ బాదావత్ రవినాయక్ అన్నారు. శుక్రవారం పుర పరిధిలోని 10వ వార్డులో సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత ఐదేళ్ల నుంచి మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి ఆధ్వర్యంలో కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి చేశామన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- పురపాలికలో రూ.250 కోట్లతో అభివృద్ధి పనులు
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

తుర్కయంజాల్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం, పాలకవర్గం వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధిలో తుర్కయంజాల్ మున్సిపాలిటీ ప్రథమ స్థానంలో నిలిచిందని తెలిపారు. బీఆర్‌ఎస్ హయాంలో రూ.130 కోట్ల నిధులు ఖర్చు చేయగా, కాంగ్రెస్ ప్రభుత్వం అనతి కాలంలోనే రూ.250 కోట్లకు పైగా నిధులు వెచ్చించి, అభివృద్ధి చేపట్టిందని పేర్కొన్నారు. రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో పురపాలికకు భారీగా నిధులు మంజూరు చేయించి, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. హయత్‌నగర్ మునగనూర్, తొర్రూర్ మీదుగా కోహెడ ఔటర్ రింగ్ రోడ్డు వరకు త్వరలో 100 ఫీట్ల రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. అదే విధంగా తుర్కయంజాల్ నుంచి తొర్రూర్ వరకు, ఇంజాపూర్ నుంచి మునగనూర్ వరకు రహదారి నిర్మాణ పనులు చేపట్టనున్నామని వివరించారు. చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ మాట్లాడుతూ.. గడిచిన ఐదేళ్ల పాలనలో ప్రజలకు, పురపాలికకు సేవ చేయడం ఆనందంగా ఉందని చెప్పారు. ప్రతి వార్డుకు రూ.5 కోట్ల నుంచి 8 కోట్ల వరకు నిధులను ఖర్చు చేసి పనులను పూర్తి చేశామని వెల్లడించారు. రాష్ట్రంలో అభివృద్ధి చెందుతున్న మున్సిపాలిటీల జాబితాలో చోటు దక్కించుకుని, రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు పొందడం, స్వచ్ఛతలో అవార్డును అందుకోవడం మరిచిపోలేమని స్పష్టంచేశారు. పాలన కాలంలో సహకరించిన పాలకవర్గ సభ్యులు, అధికారులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. టీశాట్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, కమిషనర్ అమరేందర్ రెడ్డి, వైస్ చైర్ పర్సన్ గుండ్లపల్లి హరిత తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

పీఆర్‌టీయూ ఫ్రెండ్లీ క్రికెట్

ఇబ్రహీంపట్నం రూరల్: గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని సామాజిక వేత్త నక్క శ్రీనివాస్ యాదవ్, పీఆర్‌టీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు గోవర్ధన్ యాదవ్‌లు అన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి బొంగ్లూర్‌లో పీఆర్‌టీయూ ఇబ్రహీంపట్నం శాఖ అధ్యక్షుడు వర్కాల పరమేష్ ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విజేత, రన్నరప్ జట్లకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, పవన్, రంగారెడ్డి, ఆంజనేయులు, ఆనంద్, అరవింద్, హరిప్రసాద్, గోవర్ధన్, మహేశ్, రాజు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

మున్సిపాలిటీని అభివృద్ధి చేశాం

తుక్కుగూడ: మున్సిపాలిటీ ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం తమ అదృష్టమని చైర్‌పర్సన్ బరిగెల హేమలత అన్నారు. శుక్రవారం పుర కేంద్రంలోని ఎస్‌ఎస్ గార్డెన్‌లో కౌన్సిలర్లు తమ పదవీ కాలం ఐదేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పాలక మండలి సభ్యులందరూ గత ఐదేళ్ల నుంచి వార్డుల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పని చేశామన్నారు. కోట్ల రూపాయల నిధులు ఖర్చు చేసి మున్సిపల్‌ను అభివృద్ధి చేశామన్నారు. అనంతరం మున్సిపల్ అధికారులు పాలకమండలి సభ్యులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఏ.వాణి, వైస్‌చైర్మన్ బి.వెంకట్‌రెడ్డి, మేనేజర్ పర్వతాలు, కౌన్సిలర్లు శివకుమార్, పద్మ, తేజస్విని, విలాస్, రవినాయక్, సుమన్, భావన, రాజు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మగౌరవ ప్రతీక పాపన్నగౌడ్

- ఆయన పోరాట స్ఫూర్తిని కొనసాగిద్దాం ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధి డబిల్‌గూడ గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, శాసన మండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్ గౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్‌లతో కలిసి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజ్యాంగం, చట్టాలు లేని రోజుల్లోనే ప్రజల హక్కుల కోసం పాపన్న గౌడ్ పోరాడారని గుర్తుచేశారు. మొఘల్ సైన్యాన్ని సైతం ఎదురించి నిలబడిన మహనీయుడని కొనియాడారు. పేదల కోసం నిరంతరం తపించారని చెప్పారు. తెలంగాణలో జమీన్‌దారులు, జాగీర్దార్లు, పెత్తందార్లు భూస్వామ్య ధనిక వర్గాలపై తిరుగుబాటు బావుటాను ఎగురవేసిన తొలి విప్లవ వీరుడు పాపన్న గౌడ్ అని కీర్తించారు. ప్రతి ఒక్కరూ ఆయన జీవితాన్ని, పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో జై గౌడ ఉద్యమం జాతీయ అధ్యక్షుడు రామారావు గౌడ్, గౌడ అఫీషియల్ ప్రొఫెషనల్ అధ్యక్షుడు బండి సాయన్న గౌడ్, బీజేపీ జాతీయ కిసాన్‌మోర్చా కార్యవర్గ సభ్యుడు పాపయ్య గౌడ్, పార్టీ జిల్లా కార్యదర్శి యాదయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి తదితరులు